●వికసించిన మే పుష్పం



తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని రైతు సామ భీంరెడ్డి ఇంట్లో మే పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే పూచే ఈ పువ్వు అందరినీ ఆకర్షిస్తోంది. మూడు లేదా నాలుగు రోజుల వరకు ఉంటుందని భీంరెడ్డి తెలిపారు. దీనిని చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు.

-హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

● భక్తిశ్రద్ధలతో పుష్పయాగం

స్వామి వారికి నిర్వహించిన పుష్పయాగం



హాజరైన భక్తులు



కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాంజనేయ స్వామి వారికి పుష్ప యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమజ్జయంతి వేడుకల వేళ కొత్తపేట స్నేహపురి పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న స్వామికి ఈ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అర్చకులు అమ్మ, స్వామివార్లకు శాస్త్రోక్తంగా పూలమాలలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం జైశ్రీరామ్, గోవిందనామాలతో మారుమోగింది. వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పువ్వులను సమర్పిస్తూ పుష్ప యాగం నిర్వహించారు. అనంతరం పుష్పాలరాశిని తమలపాకులతో అలంకరించారు. పుష్ప యాగానికి స్నేహపురి సహా పరిసర కాలనీల భక్తులు భారీగా విచ్చేశారు. తొలుత హనుమజ్జయంతి వేడుకల సందర్భంగా విశేష పంచామృత అభిషేకాలు అర్చనలు ఆరాధన నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో నిర్వహించిన మన్యుసూక్త విశేష హోమ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, మే 23(ఆంధ్రజ్యోతి): అమృత్ మిత్ర 2.0 ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దఅంబర్‌పేట్‌లోని ఈదుల చెరువు, నర్సరీని మహిళ స్వయం సహాయక సంఘం సభ్యులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి పరిశీలించారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఉమన్ ఫర్ ట్రీ కిట్‌లను వారికి అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ శివానందం, డీఈ సుమంత్, మేనేజర్ కిరణ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సరోజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మహాలక్ష్మి(ఫైల్)

సరూర్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పాటు మతి స్థిమితం సరిగాలేని ఓ మహిళ బంధువుల ఇంటికి వచ్చి అదృశ్యమైంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం అనకాపల్లికి చెందిన నూకేశ్వర్‌రావు భార్య మహాలక్ష్మి గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని వెంకటసాయినగర్ కాలనీలో గల తమ బంధువుల ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం 8.30గంటలకు బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై రాజశేఖర్ చెప్పారు.

ఐటీ జాబ్స్ పేరిట మోసం

నిందితుడి అరెస్టు, రిమాండ్



నిందితుడు సురేష్

కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్/ ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నగదు కాజేసిన పాత సైబర్ నేరస్తుడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరుకు చెందిన పోలవరపు సురేష్(32) ఓ పాత సైబర్ నేరస్తుడు. రెండు సైబర్ క్రైమ్ కేసుల్లో అరెస్టు కావడం జైలు నుంచి విడుదల కూడా అవ్వడం జరిగిపోయాయి. బయటికి వచ్చిన అతడు మళ్లీ సైబర్ మోసాలు చేయడం మొదలు పెట్టాడు. గడ్డిఅన్నారం పరిధిలో ఉండే మహేశ్వరి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ అన్వేషణలో ఉంది. సోషల్ మీడియా వేదికపై సాఫ్ట్‌వేర్/ ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు చేయడానికి తనను సంప్రదించవచ్చని సురేష్ ప్రకటన ఇచ్చాడు. మహేశ్వరిని ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకుని, టెక్ మహీంద్ర కంపెనీలో మేనేజరుగా పని చేస్తున్నానని నమ్మించాడు. సదరు కంపెనీలో జావా ప్రోగ్రామ్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తానని రెండు నెలల క్రితం ఆమెతో పాటు ఆమె స్నేహితుల స్టడీ డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించుకుని రూ 2,60,000 కాజేశాడు. నకిలీ అపాయింట్‌మెంట్ పత్రాలు పంపించాడు. చెక్ చేసుకుని మోసపోయామని గుర్తించిన బాధితులు.. రాచకొండ సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన వారు సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాలనీల అభివృద్ధే ధ్యేయం : కార్పొరేటర్

వనస్థలిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్డు పనులు చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్ కాలనీలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. కాలనీల్లో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విశాలమైన సీసీ రోడ్డు పనులను చేపట్టాలని సూచించారు. కాలనీల అభివృద్ధే తన ధ్యేయం అని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ

వనస్థలిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): వైన్స్ షాపులో గ్రిల్స్ తొలగించి నగదు చోరీ చేశారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగన్నగూడలో చంద్రప్రకాశ్ ఎస్.ఆర్.వైన్స్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి 10.30 గంటలకు వైన్స్ షాపుమూసివేశాడు. అప్పటికి కౌంటర్‌లో రూ2 లక్షల 80వేలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం వచ్చి షాపు తాళం తీసి కౌంటర్ తెరిస్తే నగదు ఉన్న కనిపించడం లేదు. షాపు అంతా గమనిస్తే వెనుక తలుపు గ్రిల్స్‌లను పగలగొట్టింది. కౌంటర్‌లో ఉండాల్సిన నగదు కనిపించకుండా పోయింది. వెంటనే ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైదేహినగర్‌లో వ్యభిచారం

మహిళతో పాటు విటుడి అరెస్టు

వనస్థలిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారానికి పాల్పడుతున్న మహిళను, విటుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైదేహినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మహిళ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నది. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఆ ఇంటిపై పోలీసులు దాడి చేసి అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన శివారెడ్డి(28)తో పాటు మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాదన్నపేట మండీ సమస్యలు పరిష్కరిస్తాం

సైదాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యం, వరద నీటి కాలువ సమస్యలను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు శుక్రవారం మార్కెటింగ్ అధికారులతో కలిసి ఆయన మండీలో పర్యటించారు. సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్ స్థలంపై కోర్టు వివాదం ఉంటడంతో అధికారులు చెత్త తరలింపు చేపట్టకపోవడంతో పరిసరాలు దుర్గంధంగా మారాయని రైతులు, వ్యాపారులు తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చినా వరద నీరు నిలిచి బురదమయంగా మారుతోందని వాపోయారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

రాఘవేంద్రనగర్ కాలనీ వాసులకు ఊరట

హయత్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రనగర్ కాలనీవాసులకు ఊరట కలిగింది. శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం కొత్త లైను వేయడానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అప్పుడున్న ఇళ్లను దృష్టిలో పెట్టుకుని చిన్న డ్రైనేజీ లైన్ వేశారు. ఇటీవల రాఘవేంద్రనగర్ కాలనీలో పెద్ద ఎత్తున్న అపార్టుమెంట్లు, ఇళ్ల నిర్మాణాలు జరగడంతో మురుగు ఎక్కువగా వచ్చి మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని, దీంతో చాలా కాలంగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావెద్ పాషా



అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి అబ్దుల్ జావెద్

సంతోష్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగ కార్మికులు తమ హక్కులు, సంక్షేమానికి సంబంధించిన చట్టాల గురించి తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావెద్ పాషా అన్నారు. చంపాపేటలోని ట్విన్ టవర్స్‌లో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) ఐఎస్ సదన్ పోలీసులు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం కార్మికుల కోసం సూచించిన హక్కుల గురించి తెలిపారు. సమాచారంపై అవగాహన ఉన్న కార్మికులే వారి రక్షణ కోసం రూపొందించిన కార్మిక చట్టాల ద్వారా ప్రయోజనం పొందగలరని పేర్కొన్నారు. ఏవైనా చట్టపరమైన సమస్యలను ఎదుర్కొంటూ ఉంటే కార్మికులు సహాయం కోసం డీఎల్ఎస్ఏను సంప్రదించాలని కోరారు. కార్మికులు వివిధ పథకాల కింద ప్రయోజనాలను పొందడానికి సంబంధిత ప్రభుత్వ విభాగాలలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు బీమా కవరేజీని పొందడానికి ప్రతీ కార్మికుడు ఇ-శ్రమ్ కార్డు పొందాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటరీ సత్యనారాయణ రాజు, ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ విజయ్‌కుమార్, సైట్ ఇంజినీర్ జె.డి ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తాన్ని వెంటనే అమలు చేయండి

ఆదివాసీ జేఏసీ నాయకుడు వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయ హస్తంను వెంటనే అమలు చేయాలని గిరిజన ఆదివాసీ జేఏసీ నాయకుడు కండెల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ అయిన అంబేడ్కర్ అభయ హస్తం సాధనకు దళిత, గిరిజన ఆదివాసీ జేఏసీ జూన్ 26న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును ఆయన నివాసంలో జేఏసీ నాయకులు కలిసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్ ఆంధ్రకేసరినగర్, కమలానగర్, తదితర కాలనీవాసులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసి తమ సమస్యలను వివరించారు. 40 ఏళ్లుగా ఈ కాలనీల్లో వేలాది ఇళ్లను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. కానీ ఇటీవల ఓ వ్యక్తి వచ్చి కమలానగర్, ఆంధ్రకేసరినగర్, తదితర కాలనీల్లో ఉన్న భూమి తన పేరు మీద ఉందని కేసు వేసి ఆర్డీవో దగ్గర నుంచి స్టేటస్‌కో తీసుకొచ్చాడన్నారు. కాలనీవాసులందరం సదరు ఆర్డీవోను కలిసి సమస్యను వివరిస్తే మరలా ఒకసారి ఈ కాలనీలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తానని తెలిపారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా ఆర్డీఓకు ఫోన్ చేసి.. నలభై ఏళ్లుగా ప్రభుత్వ అనుమతితో బ్యాంకుల లోన్లతో న్యాయబద్ధంగా ఇళ్లను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఎవరో కావాలని స్థలాన్ని కబ్జా చేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. దీన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. త్వరలోనే సదరు కాలనీల్లో పర్యటిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కేఎల్లార్

కాంగ్రెస్ ఎస్సీ విభాగంలో పదవుల భర్తీ

సరూర్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్సీ సెల్‌లో పలు పదవులను భర్తీ చేశారు. సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ ప్రతిపాదించిన జాబితాను పరిశీలించిన నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) సదరు జాబితాకు ఆమోదముద్ర వేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దేప భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నందిగామ నర్సింహ, ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు జంగయ్య, ఎ.సత్యనారాయణ, పాండు రంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదవులు పొందిన వారు..

బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, మహేశ్వరం మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా స్వామి, యాదయ్య, మీర్‌పేట్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా దయాకర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, తుక్కుగూడ మునిసిపాలిటీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా రాజు తదితరులను నియమించగా కేఎల్లార్ నియామక పత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మన్సూరాబాద్ సౌత్‌ఎండ్ పార్కు కాలనీలో ఉండే విద్యార్థి అజ్మీరా రాజశేఖర్(21) ఈ నెల 21న రాత్రి 10.30 గంటలకు కామినేని క్రాస్ రోడ్స్ నుంచి సర్వీసు రోడ్డులో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గోపీకృష్ణ కుందరపు(42) సర్వీసు రోడ్డులో కామినేని క్రాస్ రోడ్డు వైపు బైక్‌పై వేగంగా వస్తున్నాడు. దుర్గా ఫైర్ వర్క్స్ వద్ద బైకులు ఢీ కొన్నాయి. దీంతో ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ఇద్దరినీ చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అజ్మీరా రాజశేఖర్ శుక్రవారం మృతి చెందాడు. గోపీకృష్ణ అదే ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. రాజశేఖర్ సోదరుడు అజ్మీరా వంశీ ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి

● లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత



ఇందిరమ్మ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కో ఇందిరమ్మ లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ. ఐదు లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీని పక్కాగా అమలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 20వ, 31వ డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు శుక్రవారం ఆమె ధ్రువ పత్రాలు అందజేశారు. అర్హులైన పేద లందరికీ సొంత ఇళ్లు ఉండాలన్నది సీఎం లక్ష్యమని, ఆ దిశలో ఆయన చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ దశలవారీగా ఒక్కో హామీని ప్రభుత్వం అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, పెద్దబావి బాబు, నయనాచారి, సోమేశ్‌నాయక్, వార్డు ఆఫీసర్లు శ్రీకాంత్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 8వ, 9వ, 27వ డివిజన్లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన ధ్రువ పత్రాలను శుక్రవారం మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందాడి శ్రీరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ అందజేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంత గూడు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుట్టగల్ల జగన్, యెలకొండ శ్రీధర్‌రెడ్డి, బంగారి అశోక్, యాతం మహేందర్‌యాదవ్, మరాఠి నర్సింగ్, గడ్డం జనార్దన్, బంగారి శేఖర్, మల్లెపూల నాగరాజు, గౌతమ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో

అల్మాస్‌గూడ 5వ, 26వ డివిజన్లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ నాయకుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం ఇళ్ల ధ్రువపత్రాలను అందజేశారు. నాడు వైఎస్, నేడు రేవంత్‌రెడ్డి పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి, కాట్ల యాదయ్యగౌడ్, బాలూనాయక్, జెల్ల రమేశ్‌గౌడ్, రాజ్‌ఖాన్, అయోధ్యాచారి, గోవర్ధన్‌రెడ్డి, రఘు, ముత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగయ్య, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి



ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ (ఇన్‌సెట్‌లో..), చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం

చంపాపేట, మే 23(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని అతి పురాతనమైన ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి నియామకం అయ్యింది. ఆ మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ పాలకమండలి సభ్యులుగా డిండు ప్రవీణ్‌గౌడ్, మొరిశెట్టి శ్రీనివాస్, తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ్ దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్‌రెడ్డి, పూల నాగరాజు, కె.కవిత, ఒరుగంటి నరేష్, కొంద్ర సంతోష్‌కుమార్, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, అనుముల రవీందర్‌రెడ్డి, ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా అర్చకుడు ఎస్.అంబప్రసాద్‌లను నియమించారు. ఈ పాలకమండలి సంవత్సరం కాలం పాటు కొనసాగనుంది. 19 నవంబర్ 2024 రోజు పాలకమండలి నియామకం కోసం నోటిఫికేషన్ వెలుబడింది. నేతల తర్జభర్జనల మధ్య 6నెలల తర్వాత ఎట్టకేలకు హనుమాన్ దేవస్థానం పాలకమండలి నియామక కసరత్తు పూర్తి అయింది.

మృతి చెందిన మొరిశెట్టికి.....

హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్త మొరిశెట్టి శ్రీనివాస్ అనారోగ్యంతో 15రోజుల క్రిందట మృతి చెందారు. 6నెలల కిందట నోటిఫికేషన్ వెలుబడటంతో మరోమారు పాలకమండలి సభ్యుడిగా నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దేవాదాయశాఖ మాత్రం శ్రీనివాస్ మృతి చెందిన తర్వాత కూడా అతని పేరు జాబితాలో ఉంచడం విశేషం.

ఆలయ చైర్మన్‌గా ఈదులకంటి సత్యనారాయణరెడ్డి....

హస్తినాపురం డివిజన్‌లోని ఈదులకంటి రాంరెడ్డి గార్డెన్ యజమాని ఈదులకంటి సత్యనారాయణరెడ్డి కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన సత్యనారాయణరెడ్డిని ఆలయ చైర్మన్ పదవి వరించింది. పాలకమండలి సభ్యుల కోసం 117మంది దరఖాస్తు చేసుకున్నారు. వడపోతల అనంతరం దేవాదాయశాఖ పాలకమండలి సభ్యులను ప్రకటించారు.